ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 24 ఆగస్టు 2024

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం



రామగుండం బల్దియాలో అటకెక్కిన పాలన

- పది నెలలుగా సాధారణ సమావేశాలు లేవు
- వీధి దీపాలు మార్చలేని దుర్భర స్థితి
- అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- కుక్కల బెడదతో బెంబేలెత్తుతున్న జనం
- నిధులు లేక నిలిచిపోయిన 'పట్టణ ప్రగతి'..
- పాలకవర్గ గడువు ఇంకా నాలుగు నెలలే..
- డివిజన్లలో ముఖం చాటేస్తున్న కార్పొరేటర్లు

కోల్‌సిటీ, ఆగస్టు 23: రామగుండం బల్దియాలో పాలన అటకెక్కింది. పాలకవర్గం ఉన్నా లేని పరిస్థితి నెలకొంది. పదిన్నర నెలలుగా నగరపాలక సంస్థ సాధారణ సమావేశాలు నిర్వహించుకోలేని దుస్థితి నెలకొన్నది. కార్పొరేటర్లకు సమయానికి నెలవారీగా వేతనాలు చెల్లిస్తున్నా వారు విధులు పూర్తిస్థాయిలో నిర్వహించలేని పరిస్థితి. డివిజన్లలో పారిశుధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు అందించలేక చాలా డివిజన్లలో కార్పొరేటర్లు ముఖం చాటేస్తున్నారు. నాలుగు నెలల్లో పాలకవర్గం పుణ్యకాలం ముగుస్తున్నా ఎక్కడి పనులు అక్కడే అన్న చందంగా పరిస్థితులు మారిపోయాయి.

రామగుండం నగరపాలక సంస్థ పాలకవర్గం ఉన్నా అచేతనమైందని కార్పొరేటర్లు ఆరోపణలకు దిగుతున్నారు. పదిన్నర నెలలుగా పాలకవర్గ సమావేశాలు లేకపోవడంతో అసహనానికి గురవుతున్నారు. తమ ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి ఉందని ప్రజాప్రతినిధులే బహిరంగంగా పేర్కొంటున్నారు. కార్పొరేటర్లు సమస్యలపై ఫోన్లు చేస్తే అధికారులు లిఫ్ట్ చేయలేని పరిస్థితి ఉందని పేర్కొంటున్నారు. పారిశుధ్యం, ఎలక్ట్రికల్, టౌన్‌ప్లానింగ్, విభాగాలు పూర్తిగా విఫలమయ్యాయని పరిస్థితి నెలకొన్నది.

చీకట్లోనే వీధులు.. చేతులెత్తేసిన ఈఈఎస్ఎల్

రామగుండం నగరపాలక సంస్థలో వీధి దీపాలు లేక వీధులు, కూడళ్లు చీకట్లోనే ఉంటున్నాయి. 2017లో ఎనర్జి ఎఫిసియెన్సి సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)కు మెయింటనెన్స్ ఒప్పందం చేసుకున్నారు. ఏడాదిగా ఆ సంస్థ రామగుండంలో వీధిదీపాల మెటీరియల్ సరఫరా చేయడం లేదు. 457 వీధి దీపాలు మాడిపోయాయని అధికార ఫిర్యాదులే ఉన్నాయి. మరో 500 వరకు ఫిర్యాదులు రాని వెలగలని వీధి దీపాలు ఉన్నాయి. కార్పొరేషన్ 14 కూడళ్లలో హైమాస్ లైట్లు ఉండగా 3జంక్షన్ డెవలప్‌మెంట్ క్రింద హైమాస్‌లు తీసివేశారు. గోదావరిఖనిలోని ఓల్డ్ అశోక, రీగల్ షూమార్ట్, కళ్యాణ్‌నగర్, అబ్దుల్ కలాం కూడలి, రామగుండం మజీద్ కార్నర్, మేడిపల్లి చౌరస్తా, ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు తదితర కూడళ్లల్లో ఒక్కో లైట్ కూడా వెలగని దుర్భర స్థితి ఉంది. గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో సైతం రెండు లైట్లే వెలుగు తున్నాయి. తమ ఒప్పందం గడువు అయి పోయిందంటూ ఈఈఎస్ఎల్ చేతులెత్తేసింది. పైగా తమకు రూ.1.73కోట్లు రావాలంటూ డిమాండ్ పెడుతోంది.

ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ రూటే వేరు..

రామగుండం నగరపాలక సంస్థలో కీలకమైన ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ విభాగాల పనితీరు పూర్తిస్థాయి వివాదాస్పదంగా ఉంది. టౌన్‌ప్లానింగ్ విభాగంలో కేవలం ఒక టీపీవో, ఒక టీపీఎస్‌కు మాత్రమే పోసింగ్ ఇచ్చారు. నగరమంతా అక్రమ నిర్మాణాలు వెలుసున్నా పట్టించుకోలేని పరిస్థితి ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు ప్రజాప్రతినిధులు, బ్రోకర్లు వసూళ్ల దందాకు తెరతీశారు. అనుమతి లేకుండా తమకు మామూళ్లు ఇచ్చి కట్టుకోండి అంటూ నిర్మాణదారులను ప్రోత్సహిస్తున్నారు. దీంతో కార్పొరేషన్ ఆదాయనికి భారీగా గండిపడుతోంది. పైగా ప్రభుత్వరంగ సంస్థలైన ఎన్‌టీపీసీ, సింగరేణి వంటి సంస్థలతో నిర్మాణపరమైన వివాదాలపై చొరవ చూపని పరిస్థితి ఉంది.

ఇక ఇంజనీరింగ్ విభాగంలో అధికారుల కంటే కాంట్రాక్టర్లదే రాజ్యమనే పరిస్థితులు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. కాంట్రాక్టర్లకు ప్రయోజనాలు ఉన్న పనులు చేయడం, ఆ పనులు అధికారులు రికార్డు చేయడం పరిపాటి అయ్యింది. కనీసం ట్రాఫిక్ సిగ్నల్స్‌ను కూడా నిర్వహించలేని దుస్థితి నెలకొన్నది. ఏజెన్సీని పిలిచి మరమ్మతు చేయించ లేకపోవడంతో నగరంలో ఒక్క ట్రాఫిక్ సిగ్నల్ కూడా పనిచేయలేని పరిస్థితి ఉంది. ఇంజనీరింగ్ విభాగం అవినీతికి కేంద్ర బిందువుగా మారింది.

'పట్టణ ప్రగతి' పనుల రద్దుకు నిర్ణయం..

రామగుండం నగరపాలక సంస్థలో పట్టణ ప్రగతి కింద గతంలో పనులు మంజూరుచేశారు. కానీ నిధులు విడుదల చేయలేదు. వివిధ డివిజన్లలో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పైప్‌లైను తదితర పనులకు ఈ నిధులను కేటాయించారు. 20పనుల వరకు మధ్యలో నిలిచిపోగా మరో 15పనులు ప్రారంభమే కాలేదు. దీంతో ప్రారంభం కాని పనులు రద్దు చేయాలని నిర్ణయించారు. ఇదే అదనుగా కాంట్రాక్టర్లు సగం చేసిన పనులను కూడా రద్దు చేయించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. డీఎంఎఫ్‌టీకి సంబంధించి పది పనులు కూడా రద్దుచేస్తూ యంత్రాంగం ప్రోసీడింగ్‌లు జారీ చేసింది. పది నెలలుగా డివిజన్లలో పనులు లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు టీయూఎఫ్ఐడీసీ పనులే దిక్కయ్యాయి.

నాలుగు నెలలే గడువు... ముఖం చాటేస్తున్న ప్రజాప్రతినిధులు

నగర పాలక సంస్థ పాలకవర్గ గడువు మరో నాలుగు నెలలే ఉంది. డివిజన్లలో ప్రజలకు సేవలు అందని నెలకొన్నది. యంత్రాంగ వైఫల్యాలతో ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెరుగుతోంది. కొన్ని డివిజన్లలో జనం అసహనం, ఆగ్రహం కూడా వ్యక్తం చేస్తున్నారు. దీంతో చాలా మంది కార్పొరేటర్లు సమస్యలు ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా ముఖం చాటేస్తున్నారు. ఇటీవల స్వాతంత్ర్య వేడుకలకు పలు డివిజన్లలో కార్పొరేటర్లను ఆహ్వానించలేని పరిస్థితి కూడా నెలకొన్నాయని కొందరు కార్పొరేటర్లు పేర్కొంటున్నారు. దీనికి తోడు పదిన్నర నెలలుగా సాధారణ సమావేశం కూడా లేకపోవడంతో తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉందని పేర్కొంటున్నారు.



పడకేసిన పారిశుధ్యం...

రామగుండం నగరపాలక సంస్థలో పారిశుధ్య సేవలు పడకేశాయి. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయిన నగర పాలక సంస్థలో సిబ్బంది పెరిగినా ప్రజలకు పారిశుధ్య సేవలు మాత్రం అంతకంతకు తగ్గుకుంటూనే వస్తున్నాయి. కార్పొరేషన్‌లోని పారిశుధ్య విభాగంలో 400లకుపైగా సిబ్బంది ఉన్నా వారి సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదు. 50మంది వరకు పారిశుధ్య సిబ్బంది కార్యాలయంలోనే పని చేసున్నారు. ట్రాక్టర్లు, ట్రాలీలు మొరాయిస్తున్నాయి. డీజిల్‌లో అవినీతితో ఇంధనం లేక వాహనాలు ఎక్కడ పడితే అక్కడ ఆగిపోయే పరిస్థితి ఉంది. వర్షాకాలంలో కాలువల పూడికతీత, రోడ్లపై నీళ్ల నిల్వ లేకుండా చూడడం, పొదల తొలగింపు, దోమల మందుల పిచికారి వంటి సేవలు అందడం లేదు. ఫాగింగ్ కూడా నామమాత్రమైంది. ఫాగింగ్ యంత్రాలకు సరైన ఇంధనం ఇవ్వకపోవడంతో రోజు రెండు డివిజన్లు ఫాగింగ్ చేసే చోట ఒక్క డివిజన్ కూడా చేయలేని దుస్థితి నెలకొన్నది. ఇంటింటా చెత్త సేకరణ అనేది కలగానే మారింది. లక్ష్మీనగర్ వంటి వ్యాపార కూడళ్లలో రాత్రిపూట స్వీపింగ్ ఉంటుంది, తెల్లవారు వరకు కుప్ప లు కుప్పలుగా చెత్త పేరుకుపోతోంది. డ్రైన్ క్లీనర్లు, లిఫ్టర్లు సరైన సంఖ్యలో లేకపోవడంతో సూపర్‌వైజర్లల చేతులె త్తేస్తున్నారు. పారిశుధ్యంపై గతంలో పిన్‌పాయింట్ అబ్జర్వేషన్ ఉండేది. ఇప్పుడు దాని గురించి సమీక్షించే వారే కరువయ్యారు.

గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో కార్డియాలజిస్టులను నియమించండి

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కోరిన ఎమ్మెల్యే



మంత్రి దామోదర రాజనర్సింహతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఆగస్టు 23: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. శుక్రవారం మంత్రిని కలిసి ఆసుపత్రిలోని పలు సమస్యలపై విన్నవించారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఎక్కువగా గుండెపోటు మరణాలు ఉంటున్నాయని, జనరల్ ఆసుపత్రిలో క్యాత్‌లాప్‌తోపాటు కార్డియాలజిస్ట్‌లను, న్యూరో విభాగాన్ని కూడా ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి త్వరలోనే క్యాత్‌ల్యాబ్‌తో పాటు డయాగ్నొస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష



వైద్య సేవలపై అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

పెద్దపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీలోని తెలంగాణ పవర్ ప్లాంట్ స్టేజీ 2 యాష్ డైక్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అంతర్గాం మండలం మొగల్‌పహాడ్ గ్రామంలో తెలంగాణ పవర్ ప్లాంట్ స్టేజీ 2 యాష్ డైక్ నిర్మాణానికి అవసరమైన 600ఎకరాల భూసేకరణ కోసం నోటిఫికేషన్ భూసేకరణ చట్టం 2013 ప్రకారం విడుదల చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్టీపీసీ ద్వారా టోపోగ్రాఫికల్, జియోటెక్నికల్ సర్వే నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్టీపీసీ సేకరించిన 9543 ఎకరాల భూమి మ్యుటేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపుకలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్, పెద్దపల్లి ఆర్డీవో బి గంగయ్య, సహాయ సర్వేల్యాండ్ రికార్డ్ ఏడీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

● అభివృద్ధి పనులను వేగవంతంగా గ్రౌండ్ చేయాలి

రామగుండం కార్పొరేషన్‌లో మంజూరుచేసిన అభివృద్ధి పనులను త్వరగా గ్రౌండ్ చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడుతూ తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్ఐడీసీ) నిధుల ద్వారా చేపట్టిన రోడ్లు, డ్రైన్లు, లైటింగ్ మొదలగు అభివృద్ధి పనులను త్వరగా గ్రౌండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ, రామగుండం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఎస్ఈ శివానంద్, ఈఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి : కలెక్టర్

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 23: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓపీబ్లాక్‌ను పరిశీలించిన కలెక్టర్ ప్రతిరోజు వస్తున్న ఔట్‌పేషెంట్ వివరాలను అడిగితెలుసుకున్నారు. రోజుకు దాదాపు 800 మందికి పైగా ఔట్ పేషెంట్ నమోదవుతున్నాయని, అధికంగా వైరల్ జ్వరాలకు సంబంధించిన కేసులు వస్తున్నాయని వైద్యాధికారులు తెలుపగా, ఏ ప్రాంతం నుంచి ఎక్కువగా వైరల్ జ్వరాల ఓపీ కేసులు వస్తున్నాయో నివేదికను రూపొందించి సమర్పించాలని డీసీహెచ్ఎస్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో జనరల్ వార్డ్ ఐసీయూ, ఆపరేషన్ థియేటర్‌లను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా ఆసుపత్రిలో ప్రస్తుతం 72మందికి ఇన్‌పేషెంట్ సేవలు అందిస్తున్నామని అధికారులు తెలుపగా, ఆసుపత్రిలో అవసరమైతే పడకల సంఖ్య పెంచే విధంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రికి వైద్యులు సకాలంలో హాజరయ్యే విధంగా చూడాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు ఉచితంగా అందజేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న ఆయుష్ కేంద్రం పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రామగిరి ఖిల్లాను సందర్శించిన చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్



రామగిరి ఖిల్లాను పరిశీలిస్తున్న చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్

రామగిరి, ఆగస్టు 23: మండలంలోని బేగంపేట్ పరిధిలోగల రామగిరి ఖిల్లాను శుక్రవారం చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ ప్రభాకర్ సందర్శించారు. రామగిరిఖిల్లాపై గల ప్రకృతి సహజమైన వాతావరణాన్ని పరిశీలించారు. ఖిల్లాపైగల చారిత్రాత్మక కట్టడాలను పరిశీలించారు. ఆయన వెంట కాళేశ్వరం సర్కిల్ ఆఫీసర్ శివయ్య, జిల్లా ఫారెస్ట్ అధికారి నాగయ్య, బీట్ ఆఫీసర్స్ రంజిత, మాధురి, తిరుపతి, వరప్రసాద్, పవన్, ప్రదీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో పాస్టర్లపై దాడిని ఖండిస్తూ శాంతి ర్యాలీ



కొవ్వొత్తులతో సంఘీభావం తెలుపుతున్న పాస్టర్లు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 23: బంగ్లాదేశ్‌లో పాస్టర్లపై దాడి, కోల్‌కతాలో వైద్యురాలు హత్యను నిరసిస్తూ శుక్రవారం రాత్రి ఇంటర్ డినామినేషనల్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో చౌరస్తాలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో క్రైస్తవులు, హిందువులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు, గాజుల రామవరంలో ఈనెల 15న దైవ ప్రసాద్ అనే పాస్టర్‌ను తీవ్రంగా కొట్టారని, బీహార్‌లోని అర్వాల్ జిల్లాలో పాస్టర్ కుమారుడు నిలేశ్‌ను కొంతమంది హత్య చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య హేయమైన చర్య అని, నిందితులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిలైట్, సాల్మాన్‌రాజ్, రవిపాల్, థామస్, ప్రభాకర్, సదానందం, ప్రకాష్, జోసఫ్, ఇజ్రాయిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

పాలకుర్తి, ఆగస్టు 23: మండలం పరిధిలోని బసంత్‌నగర్ ఇండియా మిషన్ పాఠశాలలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలు జరిగాయి. ఇందులో బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో 250 మంది బాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహేంద్ర, ఎస్జీఎఫ్ మండల కన్వీనర్ సోమశేఖర్, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం గాయత్రీదేవి, వైస్‌ప్రిన్సిపాల్ ప్రేమనందం తదితరులు పాల్గొన్నట్లు ఆ పాఠశాల కోచ్ కృష్ణమూర్తి తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- సన్న బియ్యం నాణ్యత ప్రమాణాలు పాటించాలి - అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్



పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్

సుల్తానాబాద్, ఆగస్టు 23: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం కింద అందించే సన్న బియ్యం నాణ్యత ప్రమాణాలను పాటించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. శుక్రవారం ఆయన సుల్తానాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాలతో జిల్లాలోని వివిధ ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ విద్యార్థులకు అందిస్తున్న సన్నబియ్యం నాణ్యతను పరిశీలించడం జరుగుతుందన్నారు. సన్న బియ్యం నాణ్యత పరిశీలనలో భాగంగా ఆయన విద్యార్థులకు వండిన అన్నంను పరిశీలిస్తూ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అయితే గోదాంలో ఉన్న కొంత బియ్యం బాగా లేవని, మార్చాలని సూచించారు. సన్నబియ్యం నాణ్యత ప్రమాణాల్లో ఎటువంటి లోపాలు ఉన్న బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని అదనపు కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్, హెచ్ఎం శారద, సరిత గాజుల అంజయ్య తదితరులు ఉన్నారు.

గురుకుల కళాశాలను తనిఖీ చేసిన ఆర్డీవో

మంథని, ఆగస్టు 23: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను మంథని ఆర్డీవో హనుమానాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు, పాఠశాల, వంటశాల అవరణను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, దోమల నివారణ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు శుభ్రమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బామ్లానాయక్ తండాలో వరుస చోరీలు

పాలకుర్తి, ఆగస్టు 23: మండలం పరిధిలోని బామ్లానాయక్ తండావాసులు వరుస చోరీలతో బెంబేలెత్తుతున్నారు. 15రోజుల క్రితం 10సోలార్ బ్యాటరీలు, 2 రోజుల క్రితం మరో బ్యాటరీని ఎత్తుకెళ్లారు. శుక్రవారం పట్టపగలే ఇస్లావత్ బుజ్జి ఇంట్లో అరతులం బంగారం, 20 తులాల పట్టీలను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారని ఆ గ్రామ మాజీ సర్పంచ్ రాజునాయక్ తెలిపారు.

నేడు ఖని జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

- రెండేళ్ల తర్వాత నిర్వహణ..
- 16 అంశాలు, సమస్యలపై చర్చ..



గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 23: రెండేళ్ల తరువాత గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి సమావేశాన్ని శనివారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కలెక్టర్ కోయ శ్రీహర్ష అధ్యక్షతన జరుగనున్నది. 100పడకల ఆసుపత్రిగా ఉన్న గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ కాలేజీ వచ్చిన తరువాత జనరల్ ఆసుపత్రిగా మారింది. ఈ సమావేశంలో 16 అంశాలను ఎజెండాగా చేర్చారు. రూ.1.5 కోట్లతో ఆసుపత్రి బిల్డింగ్ ఆధునికీకరణ, పాత ఆసుపత్రిలో ఆర్వో ప్లాంట్ నిర్మాణం, కొత్తగా 16ఎయిర్ కండీషన్లు, 23ఫ్రిజ్‌లతోపాటు పేషెంట్ అటెండ్లకు షెడ్ల నిర్మాణం, మార్చురీ, స్టోర్, కిచెన్, క్యాంటీన్, డాక్టర్స్, స్టాఫ్‌లకు ప్రత్యేక గదులు, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం, సీసీ కెమెరాలు, వార్డులలో ఫైర్ ఎక్స్‌టెన్షన్లు, వీల్ చైర్స్, బ్లడ్ బ్యాంకు విస్తరణ, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు, పబ్లిక్ స్పీకింగ్ సిస్టం, ఇతర అంశాలను చేర్చారు. ఈ సమావేశానికి మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయరమణరావు హాజరు కానున్నారు.

ఇబ్బందులు పడుతున్న రోగులు...

జనరల్ ఆసుపత్రిగా మారినా రోగులకు ఇంకా పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడంలేదు. ప్రధానంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఇటీవల గుండెపోటు, పక్షవాతంతో ఎక్కువ మంది మృతి చెందుతున్నారు. గుండె వ్యాధి నిపుణులు, విభాగం ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు. న్యూరోకు సంబంధించిన వైద్య నిపుణులు కూడా లేరు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో రాత్రి10గంటలు దాటితే వైద్య సేవలు లభించడం లేదు. ఎవరికైనా రాత్రిపూట గుండెపోటు వస్తే కరీంనగర్, హైదరాబాద్‌లకు వెళ్లాల్సి వస్తుంది. చాలామంది మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఆసుపత్రికి వచ్చే అత్యవసర కేసులను కరీంనగర్, వరంగల్ ప్రభుత్వాసుపత్రులకు తరలిస్తున్నారు. డీజిల్ కొరతతో మార్గమధ్యలోనే అంబులెన్స్‌లు నిలిచిపోతున్నాయి. ఆసుపత్రిలో తగిన జనరేటర్ లేకపోవడం, ఇటీవల భారీ వాహనం రావడంవల్ల కొత్త బిల్డింగ్‌కు వెళ్లే విద్యుత్‌లైన్ తెగిపోవడం, జనరేటర్ పనిచేయకపోవడంతో ఒక రోజు రోగులు నరకయాతనను అనుభవించారు. జనరేటర్ వేయాలన్నా, దాని కోసం డీజిల్ కూడా అందుబాటులో పెట్టుకోవడం లేదు. బడ్జెట్ లేదంటూ చేతులెత్తేస్తున్నారు. పూర్తి స్థాయిలో డేటా ఎంట్రీలు లేకపోవడం, ఆసుపత్రి ఆవరణలోనే టీబీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం, దీంతో రోగులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. టీబీ సెంటర్‌ను దూరంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఆరోగ్యశ్రీలో పని చేస్తున్న 4వ తరగతి సిబ్బందికి సరైన వేతనాలు రావడం లేదు. ఆసుపత్రిలో సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్‌కు రెండు వాహనాలు కేటాయించినప్పటికీ ఒక్క వాహనంతోనే ఒక్క వాహనం నడుపుతూ రెండు బిల్లులు రికార్డు చేస్తున్నారు. ఏదైనా సంఘటన జరిగితే కింది స్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నారు తప్ప అసలు వారిపై చర్యలు తీసుకోవడం, అంబులెన్స్ మరమ్మతులు, జనరేటర్‌కు డీజిల్ బడ్జెట్ లేదు. ఇటీవల ఆసుపత్రి సందర్శనకు వచ్చిన కలెక్టర్‌కు ఆపరేషన్ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, జనరల్ సౌకర్యం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అప్రెంటిస్‌షిప్ చేసే విద్యార్థుల వద్ద అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్ల తరువాత జరుగుతున్న ఈ సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

చికిత్స పొందుతూ బాలిక మృతి

గొల్లపల్లి, ఆగస్టు 23: మండలంలోని గోవిందుపల్లి గ్రామంలో ఈ నెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలిక (16) పరిస్థితి విషమించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఎస్సై సతీష్ కుమార్ తెలిపిన కథనం మేరకు.. గ్రామానికి చెందిన బాలిక జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. బాలికను తల్లిదండ్రులు కళాశాల వసతి గృహంలో ఉంచి చదివించేందుకు సిద్ధమయ్యారు. హాస్టల్‌లో ఉండేందుకు ఇష్టపడని బాలిక ఇంట్లో నుంచి చదువుకుంటానని తల్లిదండ్రులకు తెలిపింది. అందుకు తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన బాలిక ఈనెల 21న పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు జగిత్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రతిమ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తర లించగా మూడుల రోజుల అనంతరం పరిస్థితి విషమించి మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య

కథలాపూర్, ఆగస్టు 23: జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం కలికోటలో ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసి వృథాగా ఎందుకు ఖర్చు చేశా వంటూ తండ్రి మందలించినందుకు యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం...కలికోటకు చెందిన దరావత్ చరణ్ (16) ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరం చదివి చదువు మానేసి వ్యవసాయ పనులు చేస్తున్నాడు. తండ్రి బాబు నాయక్ ఉపాధి పనులకు వెళ్లిన డబ్బులు ఖాతాలో జమ కాగా వెయ్యి రూపాయలు ఫోన్‌పే నుంచి డ్రా చేసుకుని చరణ్ ఖర్చు చేశాడు. దీంతో డబ్బులు ఎందుకు వృథాగా ఖర్చు చేశావని చరణ్‌ను మందలించడంతో మనస్థాపానికి గురయ్యాడు. క్షణికావేశంతో ఊరి చివరన ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి బాబు నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నవీన్ తెలిపారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 4,376 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. నంది పంప్‌హౌస్ నుంచి మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 419 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.302 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

రెండు పంపుల ద్వారా నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 23: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. శుక్రవారం రెండు పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 18 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీలోకి 3,872 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 51.023 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 3,872 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మిడ్ మానేరుకు..

బోయినపల్లి, ఆగస్టు 23: మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6,300 క్యూసెక్కులు, మూలవాగు, మానేరు వాగు ద్వారా 110 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 313.71 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 17.78 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. కాగా శనివారం నుంచి ఎల్ఎండీ పాజెక్టుకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు దిగువనున్న మానేరు వాగులో రైతుల మోటర్లు తొలగించుకోవాలని సూచించారు. వాగు పరిసర ప్రాంతాల్లోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.

ఉపాధి నైపుణ్య శిక్షణ దరఖాస్తులకు నేడు తుది గడువు

గణేశ్‌నగర్, ఆగస్టు 23: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ www.tgbcstudycircle.cgg.gov.inలో ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో ఎల్జీ హెప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో 100 మంది అభ్యర్థులకు 90 రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకాలం పూర్తయిన తరువాత అకాడమీ వారే ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.4000 చొప్పున భృతిని సంస్థ అందిస్తుందన్నారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన 18 నుంచి 25 ఏళ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని, వివరాలకు 0878-2268686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కొడుకును గల్ఫ్ నుంచి రప్పించాలి

- విదేశాంగ పీవోఈ అధికారికి తల్లి వినతి


పీవోఈకి విజ్ఞప్తి చేస్తున్న కుటుంబ సభ్యులు

కోరుట్ల రూరల్, ఆగస్టు 23: ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి అనారోగ్యంతో బాధప డుతున్న తన కొడుకును స్వగామానికి రప్పించే విధంగా చర్యలు తీ సుకోవాలని కోరుతూ ఓ తల్లి హైదరాబాదులోని విదేశాంగ పీవోఈ అధికా రికి వినతిపత్రం అందించింది. గల్ఫ్ మెడికల్ సెంటర్ నిర్లక్ష్యంపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఫిర్యాదు చేసింది. మండలంలోని సంగెం గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ జూన్ 24న హైదరాబాదులోని ఎస్కే మెడికల్ సెంటర్ (గల్ఫ్ దేశం గుర్తించిన వైద్య కేంద్రం)లో వైద్య పరీ క్ష చేయించుకుని జూలై 11న ఉద్యోగ వీసాపై సౌదీ అరేబియాలోని అల్ - బాద్ తాబూక్‌కు వెళ్లి ఓ కంపనీలో సూపర్ వైజర్‌గా చేరినట్లు తల్లి లక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. వెళ్లే ముందు చంద్రశేఖర్‌కు ఫిట్‌నెస్ కోసం ఇచ్చిన టీకా వికటించిందని తన కుమారుడి చేతికి తీవ్ర గాయం అయి ఆరోగ్యం క్షీణి స్తోందని కంపెనీ యజమానుల దృష్టికి తీసుకెళ్లినా స్పందిం చడం లేదని వాపోయింది. హైదరాబాదులోని మెడికల్ సెంటర్ నిర్లక్షంగా వ్యవహరించడం వల్లనే తన కొడుకు దేశం కాని దేశంలో ఇబ్బందులు పడుతున్నాడని తెలిపింది. గల్ఫ్ జేఏసీ కన్వీనర్ రవి గౌడ్ సహకారంతో చంద్రశేఖర్ సహకారంతో అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. తన కుమారుడు స్వ గామానికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరింది.

హత్యకు దారి తీసిన వివాదం

- కొలనూరు హత్య కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ గజ్జి కృష్ణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కృష్ణ

సుల్తానాబాద్, ఆగస్టు 23: చిన్న మాటతో పెరిగిన వివాదం చివరకు హత్యకు దారి తీసిందని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. మాజీ హోంగార్డు మాటూరి విజయ్‌ను హత్య చేసిన గోదారిఖనికి చెందిన రౌడీషీటర్ పులిపాక శ్రీకాంత్ అలియాస్ పల్లె శ్రీకాంత్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్టు తెలిపారు. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ కొలనూరు హత్య కేసు ఉదంతాన్ని వివరించారు. విజయ్, శ్రీకాంత్ కుటుంబాల మధ్య ఇతర భూవివాదాలున్నాయి. ఈనెల 21న రాత్రి పది గంటలకు ఓ మద్యం దుకాణం వద్ద మాటూరి విజయ్, పులిపాక శ్రీకాంత్‌ల మధ్య ఘర్షణ జరిగింది. కేవలం మూత్రశాలలు సరిగా లేవన్నందుకే మాటూరి విజయ్, పులిపాక శ్రీకాంత్ మధ్య మాటామాటా పెరిగి, ఇద్దరు కొట్టుకున్నారు. విజయ్‌ను తోసివేయడంతో పక్కనే ఉన్న ఓపెన్ డ్రైనేజీలో పడి తలకు తీవ్ర గాయమైంది. అయినా మళ్లీ లేపి తన వద్ద ఉంచుకున్న కత్తి తీసి విజయ్‌ను పొడిచి శ్రీకాంత్ పారిపో యాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న విజయ్‌ను ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లలో ఉండగానే ప్రాణాలు కోల్పోయాడు. హంతకుడు పులిపాక శ్రీకాంత్‌పై గోదావరిఖని పోలీస్ స్టేషన్‌లో హత్య కేసుతోపాటు పలు కేసులు నమోదై ఉన్నాయని, గోదావరిఖనిలో రౌడీషీటర్ మంథని సుమన్‌తో తిరిగి వారితో కలిసి హత్యకు పాల్పడ్డాడని, హత్య కేసులో జైలుకు కూడా వెళ్లివచ్చాడని ఏసీపీ తెలిపారు. పలు నేరాలు, కేసుల నమోదు నేపథ్యంలో 14 జూలై 2020న గోదావ రిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శ్రీకాంత్‌పై రౌడీషీట్ ఓపెన్ చేశారని ఏసీపీ వివరిం చారు. హత్య కేసులో ఉన్న శ్రీకాంత్ అప్పటినుంచి తనను కూడా ఎవ రైనా ఏమైనా చేస్తారని ముం దుజాగ్రత్తగా తన వద్ద కత్తి ఉంచుకుని తిరిగేవాడని, అదే భయంతో కొంతకాలంగా తన అమ్మమ్మ ఊరైన కొలనూర్‌లో ఉంటున్నాడని, ఈ నేపథ్యంలో చిన్న మాట పట్టింపుతో మాటూరి విజయ్‌ను హత్య చేశాడన్నారు. అప్పటినుంచి ఎవరికీ దొరకకుండా గోదావరిఖని, పెద్దపల్లి రైల్వే స్టేషన్లు, తదితర ప్రాంతాల్లో తలదాచుకుంటున్నాడని, ఇక ఇక్కడ ఉంటే పోలీసులకు దొరుకుతానన్న భయంతో శుక్రవారం కొలనూర్‌లోని తన ఇంటికి వచ్చి డబ్బులు తీసుకుని హైదరాబాద్ వెళదామనే ప్రయత్నంలో ఉన్న పులిపాక శ్రీకాంత్ గురించి తమకు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్సై సిబ్బంది ఉదయం శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అతని వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని, రక్తం మరకలు అంటిన దుస్తులను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు సుల్తానాబాద్ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

● సక్రమంగా విధులకు హాజరుకమ్మనందుకు..

విధులకు సక్రమంగా హాజరుకాని ఏఎన్‌ఎంను సక్రమంగా విధులకు హాజరుకావాలని అన్నందుకు ప్రభుత్వ డాక్టర్ హత్యకు పథకం వేశారని పెద్దపల్లి ఏసీపీ కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30న కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న మహేందర్ విధులు ముగించుకుని కారులో పెద్దపల్లికి వెళుతుండగా మార్గమధ్యలో ఏడుగురు గుర్తు తెలియని వ్యక్తులు రాడ్‌లు, కర్రలతో దాడి చేయగా డాక్టర్‌కు తీవ్ర గాయల య్యాయి. బాధితుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించగా పందిళ్ల గ్రామంలో ఏఎన్‌ఎంగా పని చేస్తున్న కాసిపాక విజయ కారణమని తేలింది. ఏఎన్‌ఎం విధులకు సక్రమంగా రాకపోగా తనకు పరిచయం ఉన్న ఎన్నం కృష్ణతో తిరిగేది. ఈ నేపథ్యంలో డాక్టర్ మహేందర్ మెమో జారీ చేస్తానని చెప్పడంతో విజయ తనకు సన్నిహితుడైన కృష్ణకు చెప్పింది. అన్నం కృష్ణ, విజయ, మరికొందరు కలిసి డాక్టర్‌ను హత్య చేయడానికి పూనుకున్నారు. బాధితుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎన్‌ఎం విజయతో పాటు అన్నం కృష్ణ, షేర్ల బాలాజీ, కోరడ్ల రఘువర్ధన్‌రెడ్డి, మమిడాల లావణ్‌కుమార్, హిమాయత్, దారంగుల సాగర్, బొక్కల ఆదిత్యలపై కేసు నమోదు చేసి, ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. కీలక నిందితులు విజయతోపాటు అన్నం కృష్ణ పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్నారని, ఈ నేపథ్యంలో తాము గంగారం చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండా పట్టుబడ్డారని చెప్పారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసినట్లు శుక్రవారం సుల్తానాబాద్ కోర్టులో హాజరుపరచనున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, సుల్తానాబాద్, పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్ ఎస్‌ఐలు శ్రావణ్ కుమార్, ఓంకార్ యాదవ్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో ఏసీబీ అధికారుల తనిఖీలు

» అవినీతి అక్రమాలపై ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ » పలు విభాగాల్లో ఫైళ్లను సీజ్ చేసి తీసుకెళ్లిన అధికారులు


రాజన్న ఆలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గురువారం ఉదయం రాజన్న ఆలయానికి చేరుకున్న ఏసీబీ, మెట్రాలజీ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఒకే సారి పలు విభాగాల్లో సోదాలను రాత్రి 8 గంటల వరకు చేపట్టారు. శుక్రవారం ఉదయం సైతం సోదాలు కొనసాగించారు. రాజన్న ఆలయ ప్రధాన విభాగాల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని అందిన పిర్యాదుల మేరకు ఏసీబీ అధికారులు పలు శాఖల అధికారులతో సోదాలు చేశారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయంలోని అన్నదాన సత్రం, లడ్డుల తయారీ విభాగం, గోదాం, సానిటేషన్ విభాగం, ఆడిట్ తదితర విభాగాల్లో సోదాలు నిర్వహించి ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. ఆడిట్, తూనికలు కొలతలు శాఖల అధికారులతో కలిసి సమగ్ర విచారణ చేపట్టారు. ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టడంతో రాజన్న ఆలయ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఏసీబీ అధికారుల విచారణ ఎంత మంది అధికారుల మెడకు చుట్టుకుంటోందోనని ఆలయ ఉద్యోగుల్లో జోరుగా చర్చజరుగుతుంది. సమగ్ర విచారణ చేపట్టి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లో అక్రమాలు, అవినీతి జరుగుతున్నట్లు తమకు వచ్చిన ఫిర్యాదుతో తనిఖీలు చేశామని అన్నారు. పలు విభాగాల్లో సమగ్రంగా విచారణ చేపడుతున్నామని, విచారణ పూర్తి అయిన వెంటనే నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి అందిస్తామని అన్నారు. ఆయన వెంట ఏసీబీ సీఐలు తిరుపతి, కృష్ణకుమార్ ఆడిట్, తూకలు, కొలతల అధికారులు ఉన్నారు.

పోలీసుల పేరుతో చోరీ

- తులంన్నర బంగారు ఆభరణాలు అపహరణ


సీసీ ఫుటేజీలో పోలీసులు సేకరించిన చిత్రం

కోరుట్ల, ఆగస్టు 23: తాము పోలీసులం అంటూ కోరుట్ల పట్టణంలో శుక్రవారం ఓ వ్యక్తి వద్ద నుంచి తులంన్నర బంగారు ఆభరణాలను ముగ్గురు వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన మిట్టపల్లి భూమరాజం శుక్రవారం ఉదయం కూరగాయలు కొనేందుకు తన ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఇందిరా రోడ్డు నుంచి వెళుతున్న భూమరాజంను గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి అతడి ద్విచక్ర వాహనానికి అడ్డంగా పెట్టాడు. ఆ వెంటనే మరో వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తాము పోలీసులమంటూ భూమరాజంతో మాట కలిపారు. గంజాయి తరలిస్తున్నావా అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. వెంటనే అక్కడున్న మరో వ్యక్తి భయపడినట్లు నటించి తన మెడలో ఉన్న బంగారు చైన్‌ను సదరు వ్యక్తులకు అప్పజెప్పాడు. దీంతో సదరు వ్యక్తులు భూమరాజంను కూడా తన మెడలో ఉన్న బంగారం ఇవ్వు అంటూ బెదిరించారు. ఇంతలోనే సదరు వ్యక్తులు భూమరాజం చేతిపై స్ప్రే చేసి మెడలో ఉన్న చైన్‌తో పాటు చేతికి ఉన్న ఉంగరాన్ని తీసుకుని ఆ ముగ్గురూ కలిపి అక్కడి నుంచి పారిపోయారు. కాసేపటికి తెరుకున్న బాధితుడు బంగారు చోరీకి గురైనట్లు గుర్తించి విషయం వెంటనే పోలీసులకు తెలిపారు. ఎస్‌ఐ శ్రీకాంత్, 2వ ఎస్‌ఐ శ్వేత తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితులు ఇచ్చిన సమాచారంతో తనిఖీ నిర్వహించారు. సమీప ప్రాంతాల్లో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించి అనుమానితుల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. భూమరాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నిధుల దుర్వినియోగం కేసులో ఇద్దరి రిమాండ్

తిమ్మాపూర్, ఆగస్టు 23: మండలంలోని ఎల్‌ఎండీ స్కూల్ కాంప్లెక్స్ నిధుల దుర్వినియోగంపై ఎల్‌ఎండీ పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌ఎండీ కాలనీలోని జిల్లా పరిషత్ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విధుల నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల జీతాలు సుమారు 10లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు దీనికి అదే పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి తిరుమలతో పాటు ఆమె భర్త కెరాజ్‌కుమార్‌ను బాధ్యులని ఈ ఏడాది ఏప్రిల్ 5న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజభాను చంద్రప్రకాశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో తన సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు చాలాన్లు సృష్టించి ట్రెజరీలో సమర్పించారని వివరించారు. అకౌంట్ నంబర్లు మార్చడం, ఉపాధ్యాయుల వేతనాల నుంచి అధిక చెల్లింపుల రికవరీ పేరిట తనకు తెలియకుండా డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న ఎల్‌ఎండీ పోలీసులు 420కేసుతో పాటు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు శుక్రవారం జి తిరుమలతో పాటు రాజ్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

రూ.4.92లక్షల మాయం.. కేసు నమోదు

మానకొండూర్, ఆగస్టు 23: మానకొండూర్ మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన నెమ్మది ప్రశాంత్ అనే వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఇన్‌స్ట్రాగ్రామ్ ద్వారా శుక్రవారం లింకు వచ్చింది. దీంతో ప్రశాంత్ ఆ లింకును ఓపెన్ చేయడంతో అతని బ్యాంకు ఖాతా నుంచి నాలుగు లక్షల 92వేలు మాయం అయ్యాయి. కాగా బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ సూచించారు.

ఫర్టిలైజర్ షాపులో చోరీ

మంథని, ఆగస్టు 23: స్థానిక అంబేద్కర్ చౌక్ సమీపంలో మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న చకిలం కృష్ణమూర్తి అండ్ సన్స్ ఫర్టిలైజర్ షాపులో గురువారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. షాపు ఓనర్ చకిలం శ్రీనివాస్ రోజువారీగా రాత్రి షాపునకు తాళం వేసుకొని ఇంటి వెళ్లారు. శుక్రవారం ఉదయం షాపు తెరిచిచూడగా తన షాపులో చోరీ గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. షాపు వెనుక భాగంలో ఉన్న కిటికీ స్క్రూలను దొంగ తొలగించి షాపులోకి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.2వేల నగదు, సీసీ కెమెరాల మానిటర్‌ను ఎత్తుకొని వెళ్లాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఈ మేరకు బాధితుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23: విద్యుత్ చౌర్యం చేస్తూ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసులకు పట్టుబడిన కేసులో హుజురాబాద్ మండలం సిర్సపల్లి గ్రామానికి చెందిన దొంత మైసయ్యకు 2,817 రూపాయల జరిమానా లేదా ఒక నెల సాధారణ జైలు శిక్ష విధిస్తూ కరీంనగర్ జిల్లా ఒకటవ అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ తీర్పు వెలువరించారని కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా బాబా తెలిపారు. నిందితుడిపై 2019 సంవత్సరం జనవరి 31న, అదే సంవత్సరం ఆగస్టు 20న విద్యుత్ చౌర్యం కేసులు నమోదయ్యాయని తెలిపారు.

అంబులెన్స్ బోల్తా.. ఒకరికి తీవ్ర గాయాలు


బోల్తాపడిన అంబులెన్స్

తంగళ్లపల్లి, ఆగస్టు 23: మండలంలోని బద్దెనపల్లి శివారులో ప్రమాదవశాత్తు అంబులెన్స్ బోల్తా పడటంతో ఒకరు తీవ్రంగా గాయపడగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వేములవాడ పట్టణానికి చెందిన శేఖర్ కుడి కాలు విరగడంతో హైదరాబాదులో వైద్య చికిత్స పొంది అంబులెన్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో అంబులెన్స్ బద్దెనపల్లి శివారులో ప్రమాదానికి గురై బోల్తా పడింది. దీంతో శేఖర్ ఎడమ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. అంబులెన్స్ డ్రైవర్ శివ స్వల్పంగా గాయపడ్డాడు. కాలు విరిగి చికిత్స చేయించుకొని మరో 15 నిమిషాల్లో శేఖర్ ఇంటికి చేరుకుంటాడు అనుకుంటున్న క్రమంలో దురదృష్టం వెంటాడి ప్రమాదంలో మరో కాలు విరిగి తీవ్రంగా గాయపడడం పలువురిని కలిచి వేసింది.

ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 23: శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వంకాయగూడెం గ్రామానికి చెందిన చల్ల కనకయ్య శుక్రవారం రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. కనుకయ్య తలకు బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పెట్రోలింగ్ పో లీసులు 108కు సమాచారం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న ముగ్గురిపై కేసు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 23: జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామానికి ఎర్ర శ్రావ్యను భర్త అశోక్‌తో పాటు అత్తా, మామ కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావలని వేధిస్తున్నారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్తతో పాటు అత్త రాజేశ్వరి, మామ సారయ్య నాలుగు లక్షల రూపాయల అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని బాధితురాలు పిర్యాదు చేయగా ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్ స్పెక్టర్ రవి తెలిపారు.

వేములవాడ రాజన్నకు ఉడకని నైవేద్యం

- తప్పతాగి విధులకు హాజరైన వంట మనిషి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారికి ఉడకని నైవేద్యాన్ని శుక్రవారం సమర్పించారు. స్వామి వారికి నిత్యం ఉదయం 11.30 గంటలకు జరగాల్సిన నివేదన అరగంట ఆలస్యమైంది. స్వామి వారి నివేదన సమయంలో నైవేద్యం ఏర్పాటు చేసే వ్యక్తి తప్పతాగి విధులకు హాజరుకావడంతో ఆలస్యమైనట్లు తెలుస్తోంది. ఆగమేఘాల మీద సదరు వ్యక్తి వంటకాలు చేయడంతో మాడిపోయాయి. దీంతో చేసేదేమీ లేక ఉడికీ ఉడకని నైవేద్యాన్ని స్వామి వారికి సమర్పించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, ఆగస్టు23: ఎస్‌బీఐ ఆర్‌సెటీలో ఆగస్టు 30వ తేదీ నుంచి పురుషులకు రిఫ్రిజిరేషన్ అండ్ ఏయిర్‌కండిషనర్‌లో 30రోజుల పాటు ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డి సంపత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల వారు 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 9849411002, 798115 1653 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

మూడు వేర్వేరు కేసుల్లో ఐదుగురికి జైలు శిక్ష

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 23: మూడు కేసుల్లో ఐదుగురికి జైలు శిక్ష విధించారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం అయన మాట్లాడుతూ మెమోరీ కార్డులో నీలిచిత్రాలు నింపి అమ్మిన సెల్ పాయింట్ యజమాని ఆడెపు రాజుకు రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానాను సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎ ప్రవీణ్ విధించారని అయన తెలిపారు. సెల్ పాయింట్ యజమాని సిరిసిల్ల పట్టణం సుందరయ్య నగర్‌కు చెందిన ఆడెపు రాజు అనే వ్యక్తి మొబైల్ ఫోన్‌లో రీచార్జితో పాటు, అధిక లాభాలు ఆర్జించాలనే దురుద్దేశంతో తన యొక్క కంప్యుటర్‌లో నీలి చిత్రాల వీడియోలు డౌన్లోడ్ చేసి తన వద్దకు వచ్చే కస్టమర్లకు మొబైల్ ఫోన్ మెమోరీ కార్డుల్లో నింపి డబ్బులు సంపాదించాడన్నారు.హత్యాయత్నం కేసులో రుద్రంగి గ్రామానికి చెందిన రాగుల బాలకిషన్, రాగులు దేవయ్య , రాగుల రఘు అనే ముగ్గురికి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.100 జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. మరో హత్యాయత్నం కేసులో రుద్రంగి గ్రామానికి చెందిన రాగుల వెంకటేష్, రాగుల కొండయ్య , రాగుల నరసయ్య, మర్రి తిరుపతి అనే నలుగురిపై నేరం రుజువు కావడంతో ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి 1000 రూపాయల జరిమానా విధిస్తు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ తీర్పు చెప్పారన్నారు. మూడు కేసుల్లో నిందితులకు శిక్ష పడటంలో కృషి చేసిన పీపీలు గడ్డం లక్ష్మణ్, టి పవన్, చెలుముల సందీప్, ఎస్ఐ రవీంద్రనాయుడు, కోర్ట్ కానిస్టేబుల్‌లు నరేష్, శ్రీనివాస్, కానిస్టేబుల్స్ మధుసూదన్, సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్ఐ అశోక్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు.

బస్‌స్టేషన్‌లో ల్యాప్‌టాప్ మరిచిపోయిన ప్రయాణికుడు


ల్యాప్‌టాప్‌ను డిపో అధికారులకు అప్పగిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23: కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో గుర్తుతెలియని ఒక ప్రయాణికుడు తన ల్యాప్‌టాప్‌ను మరిచిపోయాడు. బస్‌స్టేషన్‌లోని హోటల్‌లో మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను గుర్తించిన ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది వెంటనే ఆ ల్యాప్ టాప్‌ను ఆర్టీసీ డిపో-1 క్లర్క్‌కు అందించారు. హెచ్‌పీ కంపెనీకి చెందిన ల్యాప్‌టాప్ ఖరీదు లక్ష రూపాయల వరకు ఉంటుందని అంచనా. కార్యక్రమంలో ఆర్టీసీ సెక్యూరిటీ ఎస్‌ఐ ఎం లక్‌పతి, కానిస్టేబుల్ రమణ, నారాయణ పాల్గొన్నారు.

అధికారుల తనిఖీలు

చొప్పదండి, ఆగస్టు 23: సాంఘిక సంక్షేమ పాఠశాలల తనిఖీలో భాగంగా శుక్రవారం చొప్పదండిలోని జిల్లాపరిషత్ ప్రాథమిక పాఠశాల, రాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సన్నబియ్యం నాణ్యత, ఆహారాన్ని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం రజనీకాంత్ తనిఖీ చేశారు. పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ సిబ్బంది మజారుద్దీన్, సాయికుమార్ ,ప్రధనోపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యాకర్తలు పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

- ఆలయాల్లో అమ్మవారలకు కుంకుమ పూజలు


ధర్మపురి మహాలక్ష్మి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు


మహాలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, ఆగస్టు 23: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో మూడవ శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. మహిళలు కుంకుమ పూజలు, ఉద్యాపన పూజలు జరిపారు. అనేక మంది భక్తులు అమ్మవారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మధ్వాచారి రాంకిషన్ అందంగా అలంకరణ చేసిన అమ్మవారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల యాగశాల వద్ద ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసా చార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మోహనాచార్యా లక్ష్మీ హవనం నిర్వహించారు.

పాకాలవాణికుంటకు బుంగ

-తాత్కాలిక మరమ్మతులు చేసిన అధికారులు

ఇల్లంతకుంట, ఆగస్టు 23: మండలంలోని రేపాక గ్రామంలోని పాకాలవాణికుంటకు శుక్రవారం బుంగపడింది. ఇటీవల కురిసిన వర్షాలతో పాకాలవానికుంట నిండింది. మత్తడి సమీపంలోని కట్టకు బంగపడటంతో నీరు వృధాగా వెళ్లిపోవడాన్ని చూసిన మాజీ ఎంపీటీసీ కాత సుమలతమల్లేశం సమస్యను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డీఈ శ్రీనివాస్, ఏఈ రాధిక కుంటవద్దకు చేరుకొని ఎక్స్‌కవేటర్ సహాయంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.


పాకాలవాణికుంట నుంచి వెళుతున్న నీరు

ముంపు గ్రామాల రైతులు ఆందోళన చెందొద్దు



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో మహేశ్వర్

గంగాధర, ఆగస్టు 23: ముంపు గ్రామాల రైతులు ఆందోళన చెందొద్దని ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. గంగాధర మండలం గర్షకుర్తిలో శుక్రవారం ముంపు గ్రామాల రైతులతో ఆర్డీవో గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ కాళేశ్వరం లింకు ప్రాజెక్టు ఎత్తిపోతల్లో 11 టీఎంసీ కాలువ నుంచి డి4 కాలువ కింద గర్షకుర్తి, ఉప్పరమల్యాల గ్రామాల రైతులకు చెందిన 17 ఎకరాలు పోతుందన్నారు. వ్యవసాయ భూమితో పాటు చెట్లు, బావులు, ఇతర వ్యవసాయ పైపులైన్లు తప్పి పోయిన రైతులు నేరుగా ఫిర్యాదు చేయాలన్నారు. తప్పిపోయిన భూములు, బావులు, చెట్లు తదితరాలకు ప్రభుత్వ పరంగా పరిహారం అందిస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమానికి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుపమ, డీఈ విష్ణు ప్రసాద్, గర్షకుర్తి, ఉప్పరమల్యాల రెవెన్యూ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఖని 'ఉషోదయ'లో మాక్ పోలింగ్

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 23: ఎన్నికలు, వాటి విధివిధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం గోదావరిఖని రమేష్‌నగర్‌లోని ఉషోదయ హైస్కూల్‌లో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 3వ తరగతి నుంచి 10వతరగతి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు. కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎడ్విన్, శైలజ, జయపాల్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, శ్రీధర్, కిషోర్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా సిద్ధం చేయాలి

కమాన్‌పూర్, ఆగస్టు 23 : ప్రతి ఇంట సర్వే నిర్వహించి ఓటరు జాబితాలో నెలకొన్న తప్పులను సరిచేస్తూ ఓటరు జాబితాను పకడ్బందీగా సిద్ధం చేయాల్సిన బాధ్యత బూత్ స్థాయి అధికారులపై ఉందని తహసీల్దార్ ఆరిఫోద్దీన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బూత్‌స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు కార్డులో తప్పులుంటే ఫారం-8 ద్వారా సరిచేయాలని, నూతన ఓటరు నమోదు కోసం ఫారం-7 నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎల్ఎంటీ కె. శ్రీనివాస్, సీనియర్ సహాయకులు సతీష్, ఆర్ఐ గౌతమ్, జూనియర్ సహాయకులు కిరణ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 23: ఉమ్మడి జిల్లాలో బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో 100మందికి 90 రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలం పూర్తయిన తరువాత ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.4 వేల చొప్పున భృతిని సంస్థ అందిస్తుందన్నారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన 18నుంచి 25 ఏళ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలన్నారు. వివరాలకు 0878-2268686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రపంచ జానపద దినోత్సవం

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 23: గోదావరి సరిగమలు, రామగుండం కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జానపద దినోత్సవం గోదావరిఖని మార్కండేయకాలనీలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు, కళాకారులు దయానంద్‌గాంధీ, మేజిక్‌రాజా, దామెర శంకర్, కె.స్వామి, చంద్రపాల్ మాట్లాడుతూ జనపదం నుంచి పురుడుపోసుకున్నదే జానపదం అని అన్నారు. అనంతరం పలువురు కళాకారులను సన్మానించారు. పీఎస్ అమరేందర్, చీకటి అంజయ్య, మొగరం గట్టయ్య, మేజిక్ హరి, వేముల అశోక్, కుమార్, రమాకాంత్, తిరుమల్, విజయ్‌కుమార్, మల్లిక్, గద్దల శశిభూషణ్, ప్రేమ్‌కుమార్, భాగ్య, కనకయ్య, డాక్టర్ శంకర్‌లింగం రామిల్ల సర్వేశ్, గాజుల రమేష్, మేడి తిరుపతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

షీ టీంపై విద్యార్థులకు అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 23: కాలనీ, వెంకట్రావుపల్లిలోని జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు షీటీమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్ ఇంచార్జీ ఏఎస్ఐ మల్లన్న మాట్లాడుతూ మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలపై మత్తుపదార్థాలు, డ్రగ్స్ వాడకంపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం ప్రతిరోజు బస్టాండ్, ప్రధానచౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాలు, కళాశాల వద్ద షీటీమ్ నిరంతరంగా పని చేస్తుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తతతో ఉండాలని, లోన్ యాప్‌లకు జోలికి వెళ్ళవద్దని హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సదస్సులో షీటీమ్ సిబ్బంది స్నేహలత, సురేష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

జేఏసీ సమావేశానికి తరలిరావాలి

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 23: హనుమకొండలో ఆదివారం ఆటో యూనియన్ల రాష్ట్రస్థాయి జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం జరుగనుందని, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు హాజరై విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి శివరాజ్, జిల్లా ఇన్‌చార్జి కాసిపేట రాజయ్య, కాంపెల్లి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం గోదావరిఖని గాంధీనగర్‌లో జరిగిన యూనియన్ల జేఏసీ సమావేశం వారు మాట్లాడారు. ఈ జేఏసీ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట సురేష్, ఎండి ముజీబ్‌ఖాన్, ఎస్ సురేష్, రాజ్‌కుమార్, రాజు, క్రాంతి పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని ఎంపీడీవో కార్యాలయ భవనం

- మరుగుదొడ్ల పైపులైన్ లీకేజీతో దుర్గంధం - పట్టించుకోని అధికారులు


జూలపల్లి మండల పరిషత్ కార్యాలయం


మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగంలో లీకవుతున్న పైపులు

జూలపల్లి, ఆగస్టు 23 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ భవనం మరమ్మతులకు నోచుకోవడం లేదు. 20ఏళ్ల క్రితం భవనాన్ని ప్రభుత్వం నిర్మించగా గత కొన్నేళ్లుగా ఏలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో అధికారులు, సిబ్బంది, వివిధన పనుల కోసం వచ్చే ప్రజలకు అసౌకర్యంగా మారింది. మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న మరగుదొడ్లు, మూత్రశాలల పైపులు ఊడిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. అయినా వాటిని ఎవరూ పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అలాగే వర్షాకాలంలో కార్యాలయం లోపల ముందుభాగంలో నీరు ఉరుస్తూ ఉండడంతో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం వెనుక భాగం పెచ్చులు ఊడిపోతూ భవనం శిథిలావస్థకు చేరినా పట్టించుకునేవారు కరువయ్యారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయం లోపల విద్యుత్ వైరు లూజుగా మారి ప్రమాదకరంగా మారినా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రామగుండం అభివృద్ధికి ఒక్క రూపాయి తీసుకురాలేదు..

- కాంగ్రెస్ కార్పొరేటర్ల ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 23: రామగుండం అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే చందర్ ఒక్క రూపాయి తీసుకరాలేదని, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ రూ.140కోట్ల నిధులు తీసుకువస్తే కేసీఆర్, కేటీఆర్ గతంలో నిధులు ఇచ్చారంటూ క్షీరాభిషేకం చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి విమర్శించారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023లో రూ.100కోట్లు టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరయ్యాయని జీవో తీసుకువచ్చారని, కానీ నిధులు మంజూరుకాలేదని, మక్కాన్‌సింగ్ గెలిచిన మూడు నెలల్లోనే నిధులు మంజూరుచేయించారని, కానీ ఈ విషయం తెలియక కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్నారని, ఈ క్షీరాభిషేకం రామగుండాన్ని బొందల గడ్డగా మార్చిన ఓసీపీ-5పైన, కాళేశ్వరంపైన చేయాలన్నారు. 2014లో మున్సిపల్ టీ జంక్షన్ నుంచి ఫైవింక్లయిన్ వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు ఇప్పటి వరకు కూడా పూర్తి కాలేదని, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సింగరేణి అధికారులను పిలిచి రోడ్డు పనులను పూర్తి చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారన్నారు. గత ప్రభుత్వం కార్పొరేషన్‌కు వచ్చే నిధులను తమ ఖాతాలకు మళ్లించుకుని కార్పొ రేషన్‌కు 50శాతం నిధులనే ఇచ్చిందని, డీఎంఎఫ్‌టీ నిధులను సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌కు తరలించుకుపోతే చందర్ నిద్రపోయాడా అని ప్రశ్నించారు. పదవి పోయిన తరువాత బూడిద, ఇసుక, మట్టి దందాలు పోయాయని, ఆర్ఎఫ్ సీఎల్ కుంభకోణంలో ఇప్పటికీ బాధితులు వస్తున్నారని, రామగుండం అభివృద్ధి నిరోధకుడు చందర్ అని, చందర్‌కు ప్రజలు విశ్రాంతి ఇచ్చారన్నారు. పట్టణంలోని మురుగునీరు గోదావరిలో కలిసి ప్రజలు రోగాల బారిన పడితే చందర్ ఏం చేశాడని, ఎస్‌టీపీల నిర్మాణానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ నిధులు తీసుకువచ్చారని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. వ్యాపార కూడలి లక్ష్మీనగర్, కళ్యాణ్ నగర్‌లలో రోడ్లను కూడా వేయని చందర్ నేను అభివృద్ధి చేశానంటూ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు తిప్పారపు శ్రీనివాస్, బొమ్మక రాజేష్, నాయిని ఓదెలు, సింహాచలం, గడ్డం శ్రీనివాస్, అల్లి శంకర్, యాకూబ్, యుగంధర్ పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు డాక్టర్ దంపతులు అప్పగించిన బారికేడ్లు

ప్రమాదాల నివారణకు బారికేడ్ల వితరణ

సుల్తానాబాద్, ఆగస్టు 23: సుల్తానాబాద్ రాజీవ్ రహదారిపై ప్రమాదాల నివారణకు ఉపకరించేందుకు తమవంతుగా పోలీస్ శాఖకు పది ఇనుప బారికేడ్లను సుల్తానాబాద్‌కు చెందిన డాక్టర్ మహాలక్ష్మి-శ్రీనివాస్ దంపతులు అందజేశారు. లక్షా ఇరవై వేల రూపాయలు వెచ్చించి తయారుచేయించి బారికేడ్లను శుక్రవారం సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అందజేశారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్‌ల సూచన మేరకు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సమక్షంలో పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతు ప్రమాదాల నివారణలో భాగం పంచుకున్న డాక్టర్ మహాలక్ష్మి-శ్రీనివాస్ దంపతులను అభినందించారు. వారి సేవలను కొనియాడారు.

భవిష్యత్‌లో సోలార్ విద్యుత్‌కు డిమాండ్

- జేఎన్టీయూ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జేఎన్టీయూ ప్రిన్సిపాల్

రామగిరి, ఆగస్టు 23: పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా భవిష్యత్‌లో సోలార్ విద్యుత్ ఆవశ్యకత పెరుగుతుందని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రత్నాపూర్ కేవీకే విద్యాలయంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టే ఉర్జా సురక్ష ఏవం మహ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సౌర శక్తి అనేది పునరుత్పాదక శక్తి అని పేర్కొన్నారు. భవిష్యత్తులో సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఆవశ్యకత చాలా పెరుగుతుందన్నారు. ముఖ్యంగా వ్యవసాయం రంగంలో సోలార్ ప్యానల్స్ ఇన్‌స్టాలేషన్ అవకాశం కల్పించడం సంతోషకరమైన విషయమన్నారు. ప్రతిఒక్క రైతు ఉపయోగించుకొని ఫలితాలను పొందాలని సూచించారు. విద్యుత్ శాఖ ఏఈ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వినియోగం చాలామేరకు పెరిగిందని దాని ప్రత్యామ్నయంగా సోలార్ విద్యుత్ అవసరం ఉంటుందన్నారు. కేవీకే ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి శిక్షణ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో ఎలాంటి కార్యక్రమాలైనా సత్వరం రైతులకు చేరవేసేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేపట్టారు. వివిధ అంశాలపై డాక్టర్ వినోద్‌కుమార్, పీఎం కుసుమ, భానుశ్యామ్‌లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉత్పత్తిదారులు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై సమీక్ష

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 23: బీజేపీ సభ్యత్వ నమోదుపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కావేటి రాజగోపాల్, రూరల్ మండల ప్రధానకార్యదర్శి వేల్పుల రమేష్, అసెంబ్లీ ప్రముక్ పొల్సాని సంపత్‌రావు మాట్లాడుతూ సెప్టెంబర్ 1న బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా అధ్యక్షతన ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం చేయనున్నారని తెలిపారు. పెద్దపల్లి అసెంబ్లీ పరిధిలో 50 వేల మంది సభ్యత్వాలకు తగ్గకుండా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు,సీనియర్ నాయకులు ,జూలపల్లి మండల ఇంచార్జీ తంగేడ రాజేశ్వర్‌రావు, పెద్దపల్లి టౌన్ ఇంచార్జీ ఈర్ల శంకర్ ,గుడ్ల సతీష్ కందుల రాజేందర్, జాపతి రాజేష్, ఉమేశ్ పాల్గొన్నారు.

పీఎం రాష్ట్రీయ బాల పురస్కారం కోసం దరఖాస్తులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 23: మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం తరపున ఇవ్వనున్న ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ పెద్దపల్లి, జిల్లా సంక్షేమ అధికారి శ్రీ. రౌఫ్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25లో భాగంగా అందించనున్న అవార్డులకు 31 ఆగస్టు తేదీలోగా ఆన్‌లైనులో దరఖాస్తు చేసుకోవాలని 6 ఏళ్ల నుంచి 18 ఏళ్ల లోపు బాలబాలికలు వివిధ రంగాలలో ఆవిష్కరణ, సృజనాత్మకత, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు సంస్కృతి, సైన్స్ టెక్నాలజీ, ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన బాలల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, వివరాలకు ఫోన్: 9032427241 నంబర్‌ని సంప్రదించాలని పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీమాన్

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 23: తెలంగాణ రాష్ట్ర జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శిగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జీగా శ్రీమాన్‌ను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం హైదరాబాద్ బీసీ భవన్‌లో ఆర్ కృష్ణయ్య చేత శ్రీమన్నారాయణ నియామకపత్రం అందుకున్నారు. పది సంవత్సరాలుగా పెద్దపల్లి జిల్లా అధ్యక్ష బాధ్యత చేపడుతున్న శ్రీమన్నారాయణకు పదోన్నతి కల్పించినట్లు ఆర్ కృష్ణయ్య తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా మనోజ్‌గౌడ్

సుల్తానాబాద్, ఆగస్టు 23: బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి మనోజ్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం నియమాక పత్రంను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య అందజేశారు. శుక్రవారం మనోజ్‌గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఖని డిగ్రీ కళాశాలలో యూత్ ఫెస్టివల్



కళాశాలలో విద్యార్థుల ప్రదర్శన

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 23: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏయిడ్స్‌పై అవగాహన, యూత్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఎన్‌సీసీ కెడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 2కే రన్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు కళాశాలలో చేసిన నాటికలు, రీల్ సందేశాలు ఆకట్టుకున్నాయి. ఏయిడ్స్ వ్యాప్తికి గల కారణాలు, నివారణ చర్యలపై పలువురు వక్తలు మాట్లాడారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్‌ఓజా, ఐసీటీసీ కౌన్సిలర్ కె.శంకర్, వైఆర్‌జీకె కోఆర్డినేటర్ జి.మధుకర్, వైస్ ప్రిన్సిపల్ సాంబశివరావు, రెడ్ రిబ్బన్‌క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'రుణమాఫీ పొందిన వారే రాస్తారోకో చేయడం సిగ్గుచేటు'

సుల్తానాబాద్, ఆగస్టు 23: ప్రభుత్వం ద్వారా రుణమాఫీ పొందిన వారే రాస్తారోకో చేయడం సిగ్గుచేటని పెద్దపల్లి నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం సర్పంచ్‌ల ఫోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షులు అంతటి అన్నయ్యగౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మినుపాల ప్రకాష్‌రావు, అన్నయ్యగౌడ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్ తదితరులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం హామీలు అమలు చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా రుణమాఫీ కూడా అందరికీ వర్తింపజేస్తున్నారని అన్నారు. ఏకకాలంలో రెండు లక్షల మాఫీ దేశంలో ఎక్కడా జరగలేదని, ఓ వైపు రైతులు అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులను ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సుల్తానాబాద్ సొసైటీలో 1120 మందికి దాదాపు ఆరు కోట్ల పైన మాఫీ జరిగిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు కుమార్ కిషోర్, రాజలింగం, సురేష్‌రెడ్డి, రవి, శ్రీను, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు సన్మానం


అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

సుల్తానాబాద్, ఆగస్టు 23: జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న అశోక్‌కుమార్‌ను కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, సీఈఓ బూరుగు సంతోష్, సహకార సంఘ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అశోక్‌కుమార్ ఇక్కడి నుంచి హుజూరాబాద్‌కు బదిలీ అయ్యారు. శుక్రవారం సుల్తానాబాద్ సహకార సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అశోక్‌కుమార్‌కు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆయన సంఘాల అభివృద్ధికి చేసిన సేవలను శ్రీగిరి శ్రీనివాస్, సీఈఓ సంతోష్‌లు కొనియాడారు. వారితో పాటు సహకార సంఘ ఉద్యోగులు అశోక్ కుమార్‌ను శాలువాలతో సత్కరించారు.

హజ్‌యాత్రకు యువకుడి పాదయాత్ర

● సుల్తానాబాద్‌లో ఘన స్వాగతం


యాత్రికుడిని సన్మానిస్తున్న స్థానికులు

సుల్తానాబాద్, ఆగస్టు 23: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే మక్కాకు పాదయాత్రతో బయలుదేరిన యువకుడికి సుల్తానాబాద్ ముస్లింలు ఘనస్వాగతం పలికారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన అబ్దుల్ ఆబిద్ అనే యువకుడు మక్కా దర్శనం కోసం హాజ్‌యాత్రకు పాదయాత్ర చేపట్టాడు. ఈ నెల 12న భద్రాద్రి కొత్తగూడెంలో బయలుదేరిన ఆయన శుక్రవారం ఉదయం సుల్తానాబాద్ చేరుకోగా ఆయనకు స్థానిక ముస్లింలు స్వాగతం పలికారు. తన పాదయాత్ర ప్రతిరోజుకు ఇరవై ఐదు కిలోమీటర్లు మాత్రమే కొనసాగుతుందని ఈ మేరకు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఆబిద్ తెలిపారు. పాదయాత్ర ద్వారా ఢిల్లీ చేరుకుని జమ్మూ శ్రీనగర్ మీదుగా పాకిస్తాన్ చేరుకుని ఆ తర్వాత అఫ్గానిస్తాన్ చేరి అక్కడి నుంచి సౌదీ చేరుకుంటానని తెలిపారు. పాదయాత్ర ద్వారా తాను మక్కా చేరడానికి ఎనిమిది వేల కిలోమీటర్ల దూరం నడవాల్సి ఉంటుందని, పది నెలల సమయం పడుతుందని అన్నారు. ఉదయం సుల్తానాబాద్ వచ్చిన ఆబిద్ సుల్తానాబాద్ పాత జెండా వద్ద గల ప్రార్థనా మందిరంలో బస ఏర్పాటు చేశారు. విశ్రాంతి అనంతరం శనివారం బసంత్‌నగర్ వద్ద రాత్రి బస చేస్తాడని ముస్లిం ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎండీ అమ్జద్, ఫహీం, సాజీద్, తాజ్, ఫాషా, సాదిక్ ఫాషా, సలీం, ఆరిఫ్ ఉన్నారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 23: సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఓసీపీ-3 కృషి భవన్‌లో సింగరేణి కార్మికుల 13 డిమాండ్లతో కూడిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఓసీపీ-3 పిట్ సెక్రటరీ సారంగం మాట్లాడుతూ సింగరేణి సంస్థ లాభాలను ప్రకటించి 35శాతం వాటా చెల్లించాలని, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ వినేష్, కుంట ప్రవీణ్‌కుమార్, పెద్దపల్లి జిల్లా నాయకులు ఉల్లి మొగిలి,ఉపాధ్యక్షులు వెంకన్న, సంపత్, రాంప్రసాద్, భూమయ్య, వెంకట నర్సయ్య, లక్ష్మీరాజం, సాంబయ్య పాల్గొన్నారు.

'ఏఐటీయూసీ చేస్తున్నవి తప్పుడు ఆరోపణలు'

శ్రీరాంపూర్, ఆగస్టు 23: హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శిపై ఏఐటీయూసీ నాయకులు చేస్తున్నవి తప్పుడు ఆరోపణలని హెచ్ఎంఎస్ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి అన్నారు. వారం క్రితం గోదావరిఖనిలో స్వప్న అనే దళిత మహిళా కార్మికురాలిపై ఏఐటీయూసీ నాయకులు దాడిచేసింది నిజంకాదా అని ఆయన ప్రశ్నించారు. బాధితురాలికి మద్దతుగా అన్ని సంఘాలు బాసటగా నిలిచాయని, రియాజ్ అహ్మద్ స్పందించి న్యాయం అడగడం తప్పా అని అన్నారు. తమ తప్పును కప్పి పుచ్చుకోవడానికి ఎదురుదాడి చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా దాడిచేసిన నాయకున్ని ఏఐటీయూసీ యూనియన్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

జీఎంను కలిసిన ఐఎన్టీయూసీ నాయకులు

మందమర్రి టౌన్, ఆగస్టు 23: మందమర్రి ఏరియా జీఎంగా బాధ్యతలు స్వీకరించిన దేవేందర్‌ను ఐఎన్టీయూసీనాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏరియాలోని గనుల, డిపార్టుమెంట్ల వారీగా పలు సమస్యలను వివరించారు. అనంతరం ఆయనను సత్కరించి జ్ఞాపికను అంద జేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య పాల్గొన్నారు.

సీహెచ్‌పీని సందర్శించిన జీఎం

రెబ్బెన, ఆగస్టు 23: గోలేటి సీహెచ్‌పీని బెల్లంపల్లి ఏరియా సింగరేణి జీఎం ఎం శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. రవాణా, పరిసరాల్లో నీటిని చల్లె విధానాన్ని, ఆన్‌లైన్ మానిటరింగ్‌ను చూసి సిబ్బందిని అభినందించారు. ఉత్తమ సీహెచ్‌పీగా అవార్డు అందుకున్న సిబ్బందిని, ఉద్యోగులను అభినందించారు. జీఎం తొలిసారిగా వచ్చిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంజనీర్‌భీంరావు జాడే, సీహెచ్‌పీ హెచ్‌వోడీ కోటయ్య, రాజు పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలేవీ..?

- దౌర్జన్యంగా వ్యవహరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు - కార్మిక సంఘాల ఐక్య వేదిక


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

గోదావరిఖని, ఆగస్టు 23: దళిత మహిళపై హత్యాయత్నం చేసిన వారిని పోలీసులు ఎందుకు అరెస్టు చేయడం లేదని, సాక్ష్యం చెప్పే వారిని కూడా కొడుతున్నారని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఐ కృష్ణ ఆరోపించారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సంఘటన జరిగి పది రోజులు అయినా పోలీసులు కానీ, ఇటు సింగరేణి యాజమాన్యం కానీ స్పందించడం లేదన్నారు. ఏఐటీయూసీ అధికారంలోకి వచ్చిన తరువాత కోల్‌బెల్ట్‌లో గూండాయిజం, రౌడీయిజం పెరిగిపోయిందని, పోలీసులు కళ్లుమూసుకుంటున్నార ఆరోపించారు. కళ్ల ముందు దాడి చేసిన వారు తిరుగుతున్నా, వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఓ మహిళపై అర్ధరాత్రి హత్యాయత్నం జరిగితే ఎవరూ స్పందించకపోవడం బాధాకరమన్నారు. పెద్ద మనుషులుగా వ్యవహరించి సమస్యలు పరిష్కరించాల్సిందిపోయి ఒక దళిత కార్మికురాలిపై దాడికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు, దీనిపై త్వరలో సీపీని కలుస్తామన్నారు. ఇలాంటి సంఘటనలు చూసి చూడనట్టుగా వదిలిపెడితే మహిళలకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. మరికొందరు మహిళలపై ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. సీతారామయ్య రాజకీయం చేస్తున్నాడని, మడ్డి ఎల్లయ్యను కాపాడడానికి ప్రయత్నం చేస్తున్నాడని, ఆంధ్రా రాజకీయాలు ఇక్కడ చేస్తే చెల్లవన్నారు. వెంటనే మడ్డి ఎల్లయ్యను అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు.

కార్పొరేట్ జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్, ఆగస్టు 23: కార్పొరేట్ జీఎం(సీఎంసీ)గా పనిచేసి ఈనెలలో రిటైర్ కానున్న జి మోహన్‌రెడ్డిని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయన సింగ రేణి సంస్థలో 41 ఏళ్ల తన సర్వీసు పూర్తి చేసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జీఎం(రక్షణ) రఘు కుమార్, ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్ రెడ్డి, ఇందారం ఓసీపీ పీవో ఏ.వీ.రెడ్డి, ఏజెంట్లు పాల్గొన్నారు.

ఎస్ఆర్పీ3 గనిపై: ఎస్ఆర్పీ3 గనిలో పనిచేసి ఆర్జీ-3 ఏరియాకు బదిలీపై వెళ్తున్న రక్షణాధికారి శ్రీధర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటరావు, పిట్ కార్యదర్శి అంబాల రవి, సంక్షేమాధికారి గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: సింగరేణి అభివృద్ధికి జీఎం(సీఎంఎస్) మోహన్ రెడ్డి చేసిన సేవలు ప్రశంసనీయమని మందమర్రి ఏరియా ఇన్‌చార్జి జీఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం జీఎం కార్యాలయంలో ఈనెల 31న పదవీ విరమణ పొందుతున్న ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవీందర్, వెంకటరమణ, రామదాసు, గోవిందరావు, శ్యాంసుందర్, రాజన్న పాల్గొన్నారు.

నాసిరకమైన బూట్లు పంపిణీ చేసిన యాజమాన్యం : ఏఐటీయూసీ

శ్రీరాంపూర్, ఆగస్టు 23: సింగరేణి యాజ మాన్యం నాసిరకమైన బూట్లు పంపిణీ చేసిందని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా ఆరోపించారు. శుక్రవారం ఆయన ఎస్ఆర్పీ1 గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. నాసిరకమైన బూట్లు రెండు నెలలకే చిరిగిపోతు న్నాయని కార్మికులు తెలిపారు. పాత రూఫ్‌బోల్ట్ మిషన్లు ఉన్నాయని పేర్కొన్నారు. కార్మికులకు నాణ్యమైన పనిముట్లు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయకార్యదర్శి మోత్కూరి కొమురయ్య, పిట్‌కార్యదర్శి దాడి రాజయ్య, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, కామెర వేణు, పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

కాగా, సింగరేణి కాంట్రాక్ట్‌వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో టింబర్‌యార్డు, ఏరియా స్టోర్స్‌లో గేట్‌మీటింగ్ ఏర్పాటుచేయగా, రీజియన్‌కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ హాజరై మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి బూర వీరేశం, ప్రభాకర్, సురేంద్రచారి, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.